# అందమైన వానప్రస్థం

—శాంతి చిక్కాల

'మీనాక్షీ' అన్న పిలుపుతో భర్త రాకను గమనించి చల్లని మంచినీళ్ళగ్లాసుతో ఎదురువచ్చింది 'మీనాక్షమ్మ'. మంచినీళ్ళందుకుని త్రాగి పడకకుర్చీలో విశ్రమించారు ఆయాసంగా పరమేశ్వరంగారు. గ్లాసు తీసుకుని వంటింట్లోకి వెళ్ళి పది నిముషాల్లో 'టీ' కప్పుతో తిరిగి వచ్చింది మీనాక్షమ్మ.

ఆయన టీ అందుకుని త్రాగి "మీనూ మనం అలా కాసేపు బయటకు వెడదాం, స్నానం చేసి మెత్తని నూలు చీర కట్టుకువిరా!" అన్నారు సౌమ్యంగా.

"అలాగే" అంటూ వెనుదిరిగింది 53 సం.రాల వయస్సుగల 'మీనా'. "ఎక్కడికి? ఎందుకు?" అని కూడా ప్రశ్నించకుండా తననమసరించే భార్యను చూపులతోనే ప్రేమగా స్పృశించారు పరంగారు.

గోధుమరంగు నేత చీరలో, తలలో పువ్వులతో, నుదుట కాసంత బొట్టుతో వచ్చిన మీనాక్షమ్మ పరమేశ్వరంగారు తెల్లటి ధోవతి, లాల్చీతో ఎంతో ప్రశాంతత వుట్టిపడే విధంగా తోటలో కూర్చునుండడం చూసి దగ్గరకు వచ్చింది "కోడలితో చెప్పొద్దా మరి" అంటూ.

ఇంతలోనే పరమేశ్వరంగారు లేచి నిలబడి "అమ్మాయీ! వసుంధరా! తలుపేసుకో, మేమలా బయటకు వెడుతున్నాం" అన్నారు.

"ఎక్కడికెడుతున్నారు?" అంటూ వచ్చింది వసుంధర.

"బయటికి షికారుకు వెడుతున్నాం, అదే అబ్బాయికి కూడా చెప్పు" అన్నారు నిశ్చలంగా. మీనాక్షి ముసిముసిగా నవ్వుకుంది. చిన్న కోడలికి అన్నీ తెలుసుకోవాలని దుగ్ధ. అందుకడ్డంగా మొగుడ్ని వాడుకుంటుంది.

భార్యాభర్తలిద్దరూ ప్రక్కప్రక్కనే నడుస్తున్నారు, ఇంతలో ఆయన 'పార్కు'లోకి తిరగడం చూసి ఆయన వెంట ఆమె కూడా నడిచింది.

జనసాంద్రత లేని వృక్ష ఛ్ఛాయలో ఆగి "ఇక్కడ కూర్చుందామా? మీనూ" అన్నారు.

'మీరు నన్నడగాలా?' అన్నట్టుగా ఆవిడ గడ్డిలో కూర్చుండిపోయింది నెమ్మదిగా వంగుతూ.

"మీనూ! నేను వారం రోజుల్లో రిటైర్ కాబోతున్నాను కదా! నీకేమనిపిస్తోంది" అన్నారు ఎంతో ఆసక్తిగా.

"ఇంతవరకూ జీవితంలో ఖాళీ అంటే ఏమిటో ఎరుగని మీరు ఏం చేస్తారా? అని నేను ఆలోచిస్తున్నానండి" అంది నవ్వుతూ.

"వసుంధర ఏమంటోంది?" అన్నారు హఠాత్తుగా.


"కొత్తగా అనేదేముంది! ఆ అమ్మాయి తత్వమే అంత. వుంటే అనుభవించలేదు, లేకుంటే భరించలేదు. మీరు రిటైరవడమంటే ఆ పిల్ల దృష్టిలో ఆ ఇంటి పెత్తనమంతా వాళ్ళదేనన్నట్టు మాట్లాడుతోంది. అందుకే పెడసరం మరికాస్త పెరిగింది" అంది బాధగా.

"మీనూ! నేను చెప్పేది అడ్డుచెప్పకుండా విను. నువ్వు ఎంత చిన్నపిల్లగా, ఎన్ని కోర్కెలతో మా ఇంటికొచ్చావో నాకు తెలుసు. అమ్మా, నాన్న, తమ్ముళ్ళు, చెల్లెళ్ళు గొడవలో నీ కోర్కెలేమీ తీర్చలేకపోయాను. తమ్ముళ్ళు, చెల్లెళ్ళ బాధ్యతలు తీరిన తరువాతైనా మనం, మనంగా బ్రతకాలనుకున్నాము. కానీ, అమ్మా, నాన్నా 'మేమెవరి దగ్గరకు వెళ్ళము. మీనాక్షిలో మా కన్నతల్లిని చూసుకుంటున్నాము' అని ప్రాధేయపడ్డారు. వాళ్ళు రాలేమన్నందుకు మా తమ్ముళ్ళూ ఎంతో ఆనందించారు. నేను జన్మనిచ్చిన వారికి జీవితాంతం సేవ చేసే భాగ్యం కలిగినందుకు ఆనందించాను. నా భార్యకు ఏ అత్తమామలు ఇవ్వని 'గొప్ప కితాబు' ఇచ్చినందుకు ఎంతో సంతోషించాను. కానీ నా మీనూకు తన సంసారం తనకప్పగించలేకపోయినందుకు, ఆమె శరీరాన్నింకా శ్రమకు గురి చేస్తున్నందుకు ఎంతో బాధపడ్డాను. నా బాధను గ్రహించి నువ్వన్న మాటలు నా గుండెను కదిలించాయి..'..

'నా తల్లిదండ్రులైతే వదిలేసుకుంటావా? చెప్పండి, మన బిడ్డలను మనం ఏదైనా నిలదీసి అడగాలంటే, వాళ్ళు ఎదురు తిరిగి ప్రశ్నించే హక్కు మనమివ్వకూడదండి, అయినా ఇందులో నా స్వార్థమూ వుంది. నేను అత్తమామలకు సేవ చేస్తే రేపు నా కోడళ్ళు నాకు చేయాలని సుమా!' అంటూ నవ్వుతూ తేల్చేశావు. అప్పుడు నాకు కొండంత బరువు దిగినట్టు తేలికగా ఊపిరిపీల్చుకున్నాను

అమ్మా నాన్నల అనంతరం మన ముగ్గురు మగపిల్లలు, ఆడ పిల్ల ఎదగడం, పెద్దవాడికి పెళ్ళి చేయడం జరిగింది. అక్కడ కూడా నువ్వెంతో పెద్ద మనసు చూపించావు 'మీనూ!' కోడలిలో అసంతృప్తి పెరుగుతోందని గ్రహించగానే అమ్మాయికీ, రెండో అబ్బాయికీ పెళ్ళిళ్ళు జరిపించి, పెద్దవాళ్ళను నవ్వుతూ వేరే కాపురం పెట్టించావు. అదే ప్రేమతో రాకపోకలు సాగించావు. మూడవ వాడికి పెళ్ళి జరిపించి, రెండవవాడికి వేరు కాపురం పెట్టించావు. దానితో వాళ్ళ బాధలేవో వాళ్ళే పడుతున్నారు. పండుగకు, పబ్బానికి అమ్మాయిని చూస్తున్నారు. అంతా బాగుంది కాని ఈ మూడవ వాడు చదువు అబ్బక చిన్న ఉద్యోగంతో సతమతమవుతున్నాడని, జీతం చాలదని మనతో వుంచుకుంటుంటే, వాడ్ని మనల్నేదో వుద్ధరిస్తున్నట్టు వాడి భార్య మనల్ని ఏడ్పించుకు తింటోంది. అందుకే నేనొకటి ఆలోచించాను

'ఇప్పుడు నాకు నువ్వు తప్ప మరెవ్వరూ ముఖ్యం కాదు. ఏది చేసినా నీ సుఖం, మన ఆనందం కోసమే. అందువల్ల నువ్వు ఏమీ మాట్లాడకు. రేపు అబ్బాయిల్నందర్నీ కబురుపెట్టి మాట్లడుతాను" అని 'అరే! మాటల్లో పడి ఎంత చీకటైపోయింది' అనుకుంటూ భార్యను తీసుకుని ఇంటివైపు నడిచారు 'పరం'గారు.



ముగ్గురు కొడుకులూ కోడళ్ళూ, అత్తమామలూ అందరూ హాల్లో సమావేశమయ్యారు. పిల్లలు బయట ఆడుకుంటున్నారు.

"నేను వచ్చే సోమవారం రిటైరవుతున్నానురా!" అన్నారు పరంగారు ఉపోద్ఘాతంగా.

"పోనీలే నాన్నా! నీకింక రెస్ట్" అన్నాడు పెద్ద కొడుకు.

"అందుకే నేనొకటి చేద్దామనుకుంటున్నానురా" అని తండ్రి అనగానే "మాతో వుండండి" అన్నారు పెద్ద కొడుకులిద్దరూ.

"మీరలా అన్నందుకు నాకు చాలా సంతోషంగా వుంది కానీ, నేను చెప్పేది కూడా సాంతం వినండి. మనకు రెల్లుగడ్డితో ఒక 'ఔట్‌హౌస్' వుంది కదా! అదంటే నాకూ, మీ అమ్మకూ ప్రాణం. అది శుభ్రంగా బాగు చేయించుకుని, మాకు కావలసిన అతి కొద్ది సామాను తీసుకుని మేమందులో వుంటాం" అని తండ్రి పూర్తి చేయకుండానే...

"అదేం బాగోలేదునాన్నా! సంపాదనాపరులైన కొడుకులుండీ మీరు వుండడం..." అని పెద్ద కొడుకు పూర్తి చేయకుండానే-

"నేను చెప్పేది పూర్తిగా వినమన్నానా?" అని చిరునవ్వుతో అంటూ. "సరే మీరంతగా చెపుతున్నారు కాబట్టి నేనొకటి చెప్తాను వినండి. మీ అమ్మకు వంటా వార్పు చేసే శక్తి లేదు. ఏ ఇంట్లో వున్నా ఆడవాళ్ళకు రిటైర్మెంటు వుండదు. అందువల్ల ఆదివారం, సోమవారం మాకు పెద్ద కొడుకు మంచీ, మంగళవారం, బుధవారం చిన్నకొడుకు మంచీ, లక్ష్మి, శుక్రవారం మూడవ వాడి మంచీ భోజనం రావాలి. శనివారం మాకు పూర్తి ఉపవాసం కనుక భోజనం అవసరం లేదు. పళ్ళూ, పాలూ తీసుకుంటాం. ఆ పరిపే భోజనం కూడా పొద్దుట మాత్రమే చాలు. సాయంకాలం చపాతీలు మేమే చేసుకుంటాం.

మనకున్న ఆస్తి ఈ ఇల్లు. ఇది అద్దెకిస్తే అయిదు వందలు వస్తుంది. కాని, మీ తమ్ముడు సంపాదనలో మీతో తూగలేదు కనుక వాడి ఇంట్లో మూడు వందలకు అద్దెకుండవచ్చు. ఆ మూడొందలూ మీరు ముగ్గురూ పంచుకోవాలి. కావాలంటే వారు ఒక వాటా అద్దెకిచ్చుకోవచ్చు" అన్నారు. చిన్న కోడలి ముఖం మతాబులా వెలిగింది. "ఇక పోతే నా పెన్షను నా కోసమే వుంచుకుంటాను. మన పనిమనిషి ముత్యాలు మాతోనే శాశ్వతంగా వుండిపోతుంది. మీ చెల్లికి నేనున్నంత కాలం ఏ లోటూ జరగదు, జరుగనివ్వను. ఆ పైన మీ ఇష్టం. అన్నలు, వదినలు తల్లిదండ్రుల్ని మరిపిస్తారో, మురిపిస్తారో?" అని ఆయన అక్కడ నుంచి గద్గదస్వరంతో లేచి వెళ్ళిపోయారు. వాళ్ళేం విన్నారో తెలియని అయోమయ స్థితిలో అందరూ ఎవరి ఇళ్ళకు వాళ్ళు చేరారు. అందరిలో ఆనందంగా వున్నది వసుంధర మాత్రమే.

రోజులు గడిచి పరమేశ్వరంగారు రిటైరవ్వడం, గడ్డిల్లు పర్ణశాలగా మారడం, చుట్టూ కళకళలాడుతూ అందమైన మొక్కలు, గడ్డిలో పరుగెడుతున్న కుందేలు పిల్లలు ఆ అహ్లాదకర వాతావరణంలో తాతగారి దగ్గర చదువు నేర్చుకుంటున్న మనుమలు, చిన్నప్పుడెప్పుడో మరచిపోయిన సంగీతాన్ని మననం చేసుకుంటూ రంగు రంగుల పూలు మాల కడుతున్న మీనాక్షమ్మ, ఆ పాటనే వింటూ చపాతీ పిండి మర్దిస్తున్న ముత్యాలు...

అప్పుడే లోపలికి వస్తున్న ముగ్గురు కోడళ్ళూ ఆ సుందర ప్రశాంత దృశ్యాన్ని చూడగానే "మా అత్త మామలు మంచివారే కాదు, తెలివైనవారు కూడా" అనుకున్నారు.

## ఎ మేటర్ ఆఫ్ ఇంపార్టెన్స్



తెలుగు పాఠకులు అంతకు ముందెప్పుడూ వినని 'బీనాదేవి' అన్న పేరుతో ఒక్కసారిగా కథాకాశంలో తళుక్కుమని మెరిసే సరికి సంచలనం కలిగింది.

ఆ కథలో రా.వి. శాస్త్రి పోలికలు ఎన్ని వున్నాయో చెప్పుకుని ఆయనేనని ఖాయం చేసుకున్నారు. ఇల్లా అనుకున్న వాళ్ళు అల్లాటప్పా పాఠకులు కాదు మరి, కొడవటిగంటి కుటుంబరావు లాంటి వారు కూడా అనుకున్నారంటే 'బీనాదేవి'లో వున్న 'ఏకలవ్యత' ఎంత మోతాదులో వుండిందో అర్థం చేసుకోవచ్చు.

ఆ తర్వాత... క్రమంగా బీనాదేవి అంటే రా.వి. శాస్త్రి కాదని తేలిపోయింది. 'బీనాదేవి' అంటే బి. నర్సింగరావు, ఆయన దేవి... అని తెలిసిపోయింది. అలా ఆ 'సస్పెన్స్' విడిపోయినా వాళ్ళిద్దరూ కలిసి ఎలా రచన చేస్తారు? ఎవరు ఏ రచన చేశారు? ... ఇటువంటి కుతూహల పూర్వకమైన 'సస్పెన్సు' వుండిపోయినట్టు ఆ ఇద్దరితో అప్పుడప్పుడూ జరిపిన 'ఇంటర్వ్యూ'లలో మనకు వెల్లడవుతుంది. నిజానికవి కేవలం కుతూహల పూర్వకమైనవే. వాళ్ళిద్దరూ కలిసి ఎలా రచన చేసేవారు అనే దానికన్నా 'బీనాదేవి' రచనే మనకు ముఖ్యం.

అలా చూస్తే... "పుణ్యభూమీ! కళ్ళు తెరు" అంటూ హెచ్చరించి, ఈ పుణ్య భూమి చేత కళ్ళు తెరిపించి, సామాజిక వాస్తవాలను దర్శింపజేయాలని తహతహ పడినట్టు... మనకు స్పష్టంగా అర్థమవుతుంది. ఈ పుణ్య భూమి కళ్ళు తెరిపించాలని గట్టిగా యత్నించడంలో బీనాదేవి పాఠకుల కళ్ళను కొంతవరకైనా తెరిపించి, కొన్ని వాస్తవాలనైనా చూపించగలిగారని, నిస్సందేహంగా చెప్పవచ్చు. అదీకాక... బీనాదేవి రచనల్లో బాగా ప్రశస్తి పొందిన 'హేంగ్ మీ క్విక్' (పుణ్య భూమి కళ్ళు తెరు) 'థ్యాంక్స్ ఫర్ ది పి.ఎం.' కథ, మరికొన్ని రచనలూ 'ఆంధ్రజ్యోతి' సచిత్ర వారపత్రికలో వచ్చాయి. క్రిందటి దీపావళి ప్రత్యేక సంచికలో కూడా 'ఆంధ్రజ్యోతి' బీనాదేవి కథను ప్రచురించగలిగింది.

యాదృచ్ఛికమే అయినా 'హేంగ్ మీ క్విక్' అన్న కేకకూ, క్రిందటి దీపావళి సంచికలో వచ్చిన 'అతడూ- ఆమే' కథ ముగింపుకూ ఒక అర్థవంతమైన అన్వయం వుంది. ఈ కథలో... ఉరి తీయనున్న ఒక వ్యక్తిని కలుసుకోడానికి అతని భార్య జైలుకు వస్తుంది. అసిస్టెంట్ జైలరు ఆమెతో "మీ వార్ని రోజూ భక్తితో చూస్తున్నాను. రేపు మీ ఇంటికి వచ్చి యశోదను (కూతురుని) చూస్తాను" అంటాడు. ఈ విధంగా 'ఉరి'కి ఒక సార్థకత ఏర్పడింది. ఈ సందర్భం గురించీ, బీనాదేవి చెప్పిన, చెప్పదలచిన దాన్ని గురించీ వివరించకుండా ఆలోచనకు వదలడం మంచిది.

సెప్టెంబర్ 4వ తేదీన హైదరాబాద్‌లో గుండెపోటుతో మృతి చెందిన బీనాదేవికి శ్రద్ధాంజలి.

లవ్... ఆల్
లవ్...ఆల్...లవ్...ఆల్
స్టెఫీ ... మోనికా ... మార్టినా ... కాప్రియాటి, మెకెన్రో,
బోర్గ్, బెకర్ ... లెండెల్ ... ఆగాసీ... ఎడ్‌బర్గ్
ఇంకా ఎందరెందరో ... కీర్తి శిఖరాలను అధిరోహించడానికి కారణమైన తారికిత
లవ్ఆల్
త్వరలో ...